# మంచినీటి కోసం మహిళల ఆందోళన

■ **ఖాళీ బిందెలతో జాతీయ రహదారిపై ధర్నా**

రేగొండ, డిసెంబరు 14 : మంచినీటి సరఫరా నిలిచిపోయినా స్థానిక సర్పంచ్ పట్టించుకోవడం లేదంటూ మహిళలు ఖాళీ బిందెలతో జాతీయ రహదారిపై గురువారం ఆందోళన చేశారు. మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన మహిళలు సమస్యను పరిష్కరించాలని పరకాల–భూపాలపల్లి జాతీయ రహదారిపై ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించడంతో గంట పాటు రాకపోకలు నిలిచిపోయాయి. మూడు నెలల నుంచి గ్రామంలో మిషన్ భగీరథతోపాటు మంచినీటి సరఫరా నిలిచి పోయింది. ఈ విషయమై పలుమార్లు సర్పంచ్‌కు మొరపెట్టుకున్నా మొరపెట్టుకోగా, వారంలో రెండు రోజులు ట్యాంకర్ ద్వారా సరఫరా చేశారు. వారం రోజుల క్రితం మోటర్ కాలి పోవడంతో సరఫరా నిలిచిపోయింది. దీంతో దిక్కుతోచని మహిళలు రోడ్డెక్కి ఆందోళన చేశారు.

**సరాఫరా నిలిచిపోయింది వాస్తవమే : కార్యదర్శి**

గ్రామంలోమంచినీటి సరఫరా నిలిచిపోయింది వాస్తవమేనని కార్యదర్శి చంద్రారెడ్డి తెలిపారు. మిషన్ భగీరథ పనులు నిలిచిపోయిన విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. జీపీ ట్యాంకర్ ద్వారా సరఫరా చేశామని, ఇటీవల మంచి నీటి బావి మోటర్ కాలిపోగా, సర్పంచ్‌కు సమాచారమిచ్చానని, నిధులు లేవని ఆయన చెప్పారని కార్యదర్శి తెలిపారు.



పరకాల-భూపాలపల్లి రహదారిపై ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న అంగోత్ నరేశ్‌కుమార్

## కలెక్టర్‌ను కలిసిన అదనపు ఎస్పీ

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 14 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా నూతన అదనపు ఎస్పీగా అంగోత్ నరేశ్ కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ భవేశ్ మిశ్రాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతి భద్రతలపై కలెక్టర్ అదనపు ఎస్పీతో చర్చించారు. పోలీస్ అధికారులు, తదితరులు ఉన్నారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహన

మహదేవపూర్, డిసెంబర్ 14 : మండలంలోని అంబట్‌పల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండలంలోని సురారం ఎస్సీ కాలనీలో జ్వర సర్వే నిర్వహించారు. అనారోగ్యంతో బాధపతుడుతున్న వారి వివరాలు సేకరించారు. చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ స ముద్రాల విజయ్ కుమార్, మాషూక్ అలీ, సత్యనారాయణ, కనకదుర్గ, శ్రీలత, శైలజ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



వివరాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది



నూతనంగా ఎన్నికైన సేవాలాల్ సేన కమిటీ సభ్యులు

## సేవాలాల్ సేన మండలాధ్యక్షుడిగా రూప్‌సింగ్

కృష్ణకాలనీ, డిసెంబర్ 14: జిల్లా అధ్యక్షుడు భూక్య సురేశ్‌నాయక్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో సేవాలాల్ సేన భూపాలపల్లి మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భూక్యా రూప్‌సింగ్, ప్రధాన కార్యదర్శిగా పాడ్య భాస్కర్‌నాయక్, అర్బన్ ప్రధాన కార్యదర్శిగా బానోత్ నరేశ్‌నాయక్, అర్బన్ మహిళా అధ్యక్షురాలుగా భూక్యా సారక్క, జిల్లా ఉపాధ్యక్షుడిగా అజ్మీరా రాజునాయక్, జిల్లా కార్యదర్శిగా సందీప్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షురాలు ధరావత్ శారద, మధూకర్‌నాయక్, రాంసింగ్‌నాయక్, వాలునాయక్, కీర్తిబాయి, రాజేందర్ నాయక్, లావుడ్య రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తగా ఎన్నికైన ఆటో యూనియన్ సభ్యులు

## చల్లగరిగ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా శంకర్

చిట్యాల, డిసెంబర్ 14 : మండలంలోని చల్లగరిగలో సాయిరాం ఆటో యూనియన్ కమిటీని గురువారం ఎన్నుకున్నారు. ఈ మేరకు అధ్యక్షుడిగా కందికొండ శంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా క్యాతం కుమారస్వామి, ఉపాధ్యక్షులుగా శ్రీపతి మొగిళి, కరుణాకర్, సురేందర్, శివ రాజు, సదానందంను సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్న డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి

కాటారం, డిసెంబర్ 14 : గ్రామాల్లో పారిశుధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత అధికారులను ఆదేశించారు. మండలంలోని బయ్యారం జీపీ పరిధిలోని గురువారంపల్లె ప్రగతి పనులను డీపీవో పరిశీలించారు. పలు వీధుల్లో తిరుగుతూ గ్రామస్తులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ పాలక వర్గం, అధికారులు సమన్వయంతో పని చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఆమె వెంట ఎంపీవో ఉపేంద్రయ్య, సర్పంచ్ సంధ్య, కార్యదర్శి రజిత తదితరులున్నారు.



పనులను పర్యవేక్షిస్తున్న డీపీవో

## కాకతీయుల నిర్మాణాలు అద్భుతం

■ **ఆస్ట్రేలియా పరిశోధక విద్యార్థి చేయా**

గణపురం, డిసెంబర్ 14 : కాకతీయులు నిర్మించిన ఆలయాలు అద్భుతమని ఆస్ట్రేలియా దేశానికి చెందిన పరిశోధక విద్యార్థి చేయా కొనియాడారు. గురువారం ఆయన వరంగల్‌లోని వేయి స్తంభాల గుడి, ఫోర్ట్ వరంగల్, రామప్ప దేవాలయాలతో పాటు మండల కేంద్రంలోని గణపేశ్వరాలయం కోటగుళ్లను సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ శిల్ప సంపదను, ప్రాకారపు ఆలయాలను వీడియోలు, ఫొటోలు తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకతీయుల రాతి కట్టడాలు ఎంతో అద్భుతమని, వారు నిర్మించిన ముఖ్య ఆలయాలను సందర్శిచానని, ఇవి ఎంతో అనుభూతినిచ్చాయన్నారు. భారతదేశంలో ప్రధానమైన కట్టడాలపై పరిశోధన చేస్తున్నట్లు చేయా తెలిపారు. అనంతరం అర్చకులు నరేశ్‌చార్యులు చేయాకు ఆశీర్వచనం, ప్రసాదాలు అందజేశారు.



పూజలు చేస్తున్న ఆస్ట్రేలియా విద్యార్థి చేయా

## మంత్రికి కాళేశ్వరం అర్చకుల ఆశీర్వచనం

కాళేశ్వరం, డిసెంబర్ 14 : రాష్ట్ర ఐటీ, శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రిగా దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శ్రీ కాళేశ్వర, ముక్తీశ్వర స్వామి దేవస్థానం వేదపండితులు, అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. ఈ మేరకు ఈవో మహేశ్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ప్రధాన అర్చకులు త్రిపురారి కృష్ణమూర్తి శర్మ, వేద పండితులు వైకుంఠ పాండా, ముఖ్య అర్చకులు ఫణీంద్ర శర్మ, వెల్దిశరత్ చంద్ర తదితరులు హైదరాబాద్‌లో శ్రీధర్ బాబును కలిసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు.



మంత్రిని ఆశీర్వదిస్తున్న వేద పండితులు




సమ్మెలో పాల్గొన్న పోస్టల్ సిబ్బంది

## మూడో రోజుకు పోస్టల్ సిబ్బంది సమ్మె

మహదేవపూర్, డిసెంబర్ 14 : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని పోస్టల్ సిబ్బంది చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం మూడో రోజుకు చేరింది. మండల కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ కార్యాలయ ఆవరణలో సిబ్బంది నిరసన కార్యక్రమం చేపట్టారు. సివిల్ సర్వీసెస్ హోదా, 8 గంటల పని, అదనపు సర్వీస్ ఇంక్రిమెంట్లు, రూ. 5 లక్షల ఇన్సూరెన్స్, రూ. 5 లక్షల గ్రాట్యుటీ ఇవ్వాలని, కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయం కల్పించడం తదితర డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐడీజీఎస్‌యూ సెక్రటరీ కుడుదుల కిష్టయ్య, రాజబాపు, వజీర్‌ఖాన్, ముజీబ్ ఉర్ రెహ్మాన్, రాజమల్లు, మధుసూదన్ పాల్గొన్నారు.



రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఆర్డీవో రమాదేవి

## వ్యవసాయ దారిపై ఆర్డీవో విచారణ

మొగుళ్లపల్లి, డిసెంబర్ 14 : మండలంలోని నర్సింగాపూర్‌లోని వ్యవసాయ దారిపై ఆర్డీవో రమాదేవి గురువారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన ఒక ఎస్సై కుటుంబ సభ్యులు దారిని ఆక్రమించి, దానిపై వెళ్తున్న సందిల్ల సులోచన అనే మహిళ, ఆమె కుటుంబ సభ్యులపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేయగా, కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో ఇరు వర్గాలు, గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీఎం ప్రజాదర్బార్‌లో సులోచన ఫిర్యాదు చేయగా విచారణ చేశానని, నివేదిను కలెక్టర్‌కు అందజేస్తానని ఆర్డీవో తెలిపారు. ఆమె వెంట తహసీల్దార్ సునీత, ఆర్ఐ సురేందర్‌రెడ్డి, ఎస్సై జాడి శ్రీధర్ తదితరులున్నారు.

## 31 వరకు స్కాలర్‌షిప్ దరఖాస్తుకు గడువు

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 14 : జిల్లాలోని అన్ని కళాశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, దివ్యాంగ, మైనారిటీ విద్యార్థులు ఫ్రెష్, రెన్యువల్ పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఈనెల 31 వరకు http://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్రెష్ విద్యార్థులు ఎస్సెస్సీ హాల్ టికెట్ నంబర్, ఆధార్‌కార్డు, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు ఖాతా నంబర్, స్టడీ సర్టిఫికెట్లు, సెట్ అలాట్ మెంట్ కాపీ, ఫొటోలు, మొబైల్ నంబర్, రెన్యువల్ విద్యార్థులు ఆధార్‌కార్డు, గత సంవత్సరం పాస్ మెమో, బ్యాంకు ఖాతా నంబర్, అఫిడవిట్, మొబైల్ నంబర్, స్టడీ సర్టిఫికెట్స్‌తో అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

**PUBLIC NOTICE**

Under the instructions of my client M/s. Shriram Finance Limited, **BHUPALPALLY Branch**. I issue the following notice to general public. My client intends to grant loan to **KALLURI SUJATHA, W/O. RAJENDRAPRASAD** Resident of Thirumalagiri by keeping the below mentioned property as security by way of Registered Mortgage. As such if any one have any claims changes. Mortgages. Sale Agreements Court Attachments. Court Disputes ect., shall be informed to the address mentioned below in writing within 07 Days days from the date of this notice. Otherwise, later objections not bind my client in this regard.

**SCHEDULE OF THE PROPERTY**

వరంగల్ జిల్లా రిజిస్ట్రారు కార్యాలయం, ఉపజిల్లా రిజిస్ట్రారు కార్యాలయం భూపాలపల్లి, జిల్లా పరిషత్ భూపాలపల్లి, మండల పరిషత్ మరియు మండలము రేగొండ, గ్రామ పంచాయితి మరియు గ్రామము తిరుమలగిరిలోని ఇంటి నెం. 3–35 లో గల సిమెంటు రేకుల ఇల్లు మరియు ఖాళీ స్థలం మొత్తం విస్తీర్ణం: 484.95 చ.గ. దీనికి సరియగు 405.46 చ.మీటర్లు సిమెంటు రేకుల ఇల్లు కట్టుబడి విస్తీర్ణం: 1056.78 చ.ఫీ., East: ఊకంటి రాంరెడ్డి & రాజిరెడ్డి & సుంకరి రఘుపతి గార్ల ఇండ్లు, West: గోపురాంరెడ్డి గారి ఇల్లు, North: సుంకరి రఘుపతి గారి ఖాళీ స్థలం & గ్రామ పంచాయితీ రోడ్డు, South: గ్రామ పంచాయితీ రోడ్డు.

Sd/- **NALLELLA SURENDER, NALLELLA SUHAS**
ADVOCATES, H.No. 1-8-489, Haritha Residency, Balasamudram, HNK, Warangal. Cell: 9849365117